క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత దొరబాబుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు శనివారం రూ. 5,20,118 విరాళంగా అందజేశారు. నిడదవోలు మండలం తాడిమల్ల గ్రామానికి చెందిన చింతల మోహన్ వెంకట దొరబాబు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

వేసవి శిక్షణా తరగతులు



విద్యార్థులకు నృసింహావతారం గురించి వివరిస్తున్న రమణ

లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. శనివారం దశావతారాల్లో నాలుగో అవతారమైన నృసింహావతారం గురించి గ్రంథాలయాధికారి సీహెచ్‌వీ రమణ విద్యార్థులకు వివరించారు. రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్ ఉపయోగాలు గురించి వివరించి, అనంతరం యోగసనాలు అభ్యాసన చేయించారు.

జైలును సందర్శించిన జడ్జి



జైలులో రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి మధుబాబు

చింతలపూడి: చింతలపూడి జైలును శనివారం మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు సందర్శించారు. కేసుల వివరాలు, ఖైదీలకు అందిస్తున్న ఆహారం, మంచినీరు, వైద్య సేవలు తదితర విషయాలపై జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాలు జైలు ముద్దాయిలకు అందించి, సహాయంపై ఆరా తీశారు. అందరూ బాధ్యతగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. వంటశాల, స్టోర్‌రూమ్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉప కారాగార పర్యవేక్షణ అధికారి కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్‌లు టోకూరి వెంకటేష్, పీఎల్‌వీ టీవీఎస్ రాజు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి కూలీలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో

కొయ్యలగూడెం: ఉపాధి కూలీల మస్టర్ల విషయంలో అవకతవకలు గుర్తిస్తే మేట్లతో సహా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం బోడిగూడెం రాయుడు చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మస్టర్ల పట్టికను పరిశీలించి, పని ప్రదేశంలో అందుతున్న సదుపాయాల గురించి ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు. సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, ఉపసర్పంచ్ వాసు బోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రింగ్ రోడ్డు గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీస్

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం మండలాలను కలుపుతూ రింగు రోడ్డు గ్రామాలమీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభించినట్లు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ పీపీడి గంగాధరరావు శనివారం పేర్కొన్నారు. ఉదయం ఆరు గంటలకు జంగారెడ్డిగూడెం నుంచి నరసన్నపాలెం, రామానుజపురం, వేదాంతపురం, కోయరాజమండ్రి, రాయగూడెం, కమ్మర బొత్తప్పగూడెం, నిమ్మలగూడెం, కన్నాపురం, పులిరామ్మగూడెంకి సర్వీసు నడపబడుతుందన్నారు. తిరిగి మళ్లీ పులిరామన్నగూడెం నుంచి ఉదయం 7.25 గంటలకు వచ్చిన రూటులోనే జంగారెడ్డిగూడెం చేరుకుంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు జంగారెడ్డిగూడెం నుంచి బయలుదేరి తిరిగి మళ్లీ ఏడు గంటలకు చేరుతుందన్నారు. పదిహేనేళ్ల అనంతరం తిరిగి రెండు మండలాల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు కావడంపై సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రాంతీయ రవాణా అధికారి ఎం డీ మదని ప్రారంభించారు. మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్ రంగనాయకులు, బి.చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- కలగా మిగిలిన గుండేరు వాగుపై వంతెన నిర్మాణం
- కుంగిన వంతెనపై భయంభయంగా రాకపోకలు
- వైఎస్సార్ సీపీ హయాంలో నిధులు మంజూరు
- వంతెన నిర్మాణాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

కామవరపుకోట: మండలంలోని కళ్ళచెరువు సమీపంలోని గుండేరు వాగుపై వంతెన కుంగిపోయి ప్రమాదకరంగా ఉంది. ఈ వంతెన ధ్వంసమై దశాబ్దం గడిచినా ఇప్పటివరకు పరిష్కారానికి నోచుకోలేదు. ఇది లింగపాలెం మండలం ఆశన్నగూడెం సమీపంలో, కామవరపుకోట మండలం కళ్ళచెరువు సమీపంలో రెండు మండలాలను కలుపుతూ సరిహద్దుగా ఉంది. ఈ వంతెనపై నుంచి నిత్యం రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తరలించడంతోపాటు, అనేక భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తుంటాయి. గత ఏడాది కురిసిన వర్షాలతో వరదలు వచ్చి వంతెన పూర్తిగా కుంగిపోయింది. దీనితో వాహనదారులు, రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో నిధులు మంజూరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో యుద్ధ ప్రాతిపదికన ఈ వంతెన నిర్మాణం చేపట్టడానికి రూ.5.5 కోట్లు, వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు బ్రిడ్జి డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు నిధులు కేటాయించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంతెన నిర్మాణం గాలికి వదిలేశారు. వంతెన పూర్తిగా పాడవడంతో వచ్చే వర్షాకాలంలో వరదలు వస్తే రెండు మండలాల ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రెండు మండలాల ప్రాంత ప్రజల ఇబ్బంది గమనించి వెంటనే గుండేరు వాగుపై వంతెన నిర్మించాలని వచ్చే వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వంతెన నిర్మాణం చేపట్టే వరకు డైవర్షన్ రోడ్డు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



గుండేరు వాగుపై వంతెన కుంగి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

వంతెన పూర్తిగా కుంగిపోయింది



కామవరపుకోట, లింగపాలెం మండలాలకు చెందిన ప్రాంతవాసులు నిత్యం ఈ వంతెనపై నుంచి రాకపోకలు కొనసాగిస్తుంటారు. వంతెన గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరటంతో వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువెళ్లేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది కురిసిన వర్షాలతో వంతెన పూర్తిగా కుంగిపోయింది. వాహనాలు వెళ్లాలంటే ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి త్వరగా వంతెన నిర్మాణం చేపట్టాలి.

– నౌదు అప్పారావు, రైతు, కళ్ళచెరువు గ్రామం

డైవర్షన్ రోడ్డు నిర్మించాలి



మా ప్రాంతం నుంచి వ్యవసాయం, వ్యాపారం కొరకు నిత్యం లింగపాలెం మండలం రంగాపురం, ఆసన్నగూడెం, వేములపల్లి ప్రాంతాలకు గుండేరు వాగ వంతెన దాటి వెళుతూ ఉంటాము. గత ఏడాది కురిసిన వర్షాలతో వంతెన పూర్తిగా కుంగిపోయింది. వచ్చే వర్షాకాలంలో వరదలకు వాగు దాటి వెళ్లాలంటే ఇబ్బంది ఎదుర్కొంటాం. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టే వరకు డైవర్షన్ రోడ్డు నిర్మించాలి.

– వెగ్రి శ్రీను, రైతు, తడికలపూడి గ్రామం

శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం



కలశాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అంకాలగూడెం స్వయంభు శ్రీ ఉమా సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయం ఎదుట నూతనంగా నిర్మించిన రాజగోపుర శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి ఆనందశివాచార్యుల పర్యవేక్షణలో గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభించారు. ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించారు. రాజగోపురంపై ప్రతిష్ఠించే కలశాలకు భక్తులచే ప్రత్యేక పూజలను చేయించారు. ఈనెల 19న గాలిగోపురంపై కలశాల ప్రతిష్ఠాపనతో ఉత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు. భక్తుల ద్రవ్యసహాయంతో సుమారు రూ.40 లక్షల వ్యయంతో రాజగోపురాన్ని నిర్మించారు.

ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు చర్యలు

ద్వారకాతిరుమల: సారా అమ్మకాలు మానేసిన వ్యక్తులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడానికి చర్యలు చేపట్టినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డీపీఈఓ ఎ.ఆవులయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. సారా అమ్మకాలు మానేసిన మండలంలోని 8 గ్రామాలకు చెందిన 71 మందితో సమీక్షించి, రుణ అర్హతను బట్టి, లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ జేవీ సుబ్బారావు, ఎంపీడీవో ప్రకాష్, డీఆర్‌డీఏ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రీస్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేసినట్టు ఎక్సైజ్ సీఐ సత్యన్నారాయణ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

కొయ్యలగూడెం: బైకు అదుపుతప్పి యువకుడు మృతి చెందినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ శనివారం తెలిపారు. జంగారెడ్డిగూడెం డాంగే నగర్‌కు చెందిన వేములపూడి సత్యనారాయణ (37) కొయ్యలగూడెం వైపు నుంచి జంగారెడ్డిగూడెం వస్తుండగా బయ్యన్నగూడెం సమీపంలోని ఇటుక బట్టి వద్ద ప్రమాదానికి గురయ్యాడు. బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయాలు కాగా హాస్పిటల్‌కి తరలించారని, చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

మునిసిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇకపై ప్రతి నెలా మూడో శనివారం గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఉన్న మౌలిక వసతులు, ఇతర సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయాలని కోరారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్లు ఉగ్గం దుర్గాప్రసాద్, పీపీఎస్ చంద్రరావు, మానవతా మూర్తి, సంకు సురేష్, కనుమూరి లావణ్య, ముప్పని రమణ, లోకవరపు వెంకటేశ్వరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, పెసరగంటి త్రిమూర్తులు, దిర్సిపోము రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు అవసరం

కొయ్యలగూడెం: వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శనివారం మండలంలో బయ్యన్నగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వడదెబ్బకు గురైన వారికి చేసే ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వేసవిలో ఉదయం 9 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తరువాత పనులు చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం వేళలో బయటకు వస్తే వడ దెబ్బ తగులుతుందని, తద్వారా ప్రాణాపాయం జరుగుతుందని తెలిపారు. వడదెబ్బ వల్ల శరీరంలోని ఖనిజ లవణాలతో కూడిన నీరు చెమట రూపంలో బయటకి పోయి డీహైడ్రేషన్‌కి గురి అవుతామన్నారు. తక్షణ చికిత్స అందకపోతే ప్రాణాపాయానికి దారి తీస్తుందన్నారు. వడ దెబ్బ లక్షణాలు గుర్తించగానే ఓఆర్ఎస్ ద్రావణం తాగాలన్నారు. వడ దెబ్బకు గురైన వారు వెంటనే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొందాలని సూచించారు. వేసవిలో అందరూ తరచుగా ఉప్పు కలిపిన మజ్జిగ, నిమ్మకాయ, పంచదార, ఉప్పు కలిపిన పానీయం, చల్లని మంచి నీరు, కొబ్బరి బొండాలు, తాజా పళ్లరసాలు తాగాలని, తద్వారా వడ దెబ్బ నుంచి రక్షణ పొందవొచ్చని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



బయ్యన్నగూడెంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీవారి క్షేత్రంలో కారుమబ్బులు



శ్రీవారి క్షేత్రాన్ని శనివారం సాయంత్రం ఉన్నట్టుండి ఒక్కసారిగా నల్లని మబ్బులు కమ్మేశాయి. కొద్ది సేపటికే జోరున వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమికి అల్లాడిన భక్తులు చల్లని గాలులతో సేద తీరారు. – ద్వారకాతిరుమల

గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూడాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ద్వారకాతిరుమల: వేసవి దృష్ట్యా గర్భిణులు, పిల్లలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గుణ్ణంపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించి, అక్కడ మహిళలు, పిల్లలకు అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వేసవిలో తీసుకోవాల్సిన చర్యలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు వారికి వైద్య సిబ్బందితో వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, గర్భిణులు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో నిర్మిస్తున్న వాననీటి సంరక్షణ పనులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎంవీ రమణ, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, ఐసీడీఎస్ సీడీపీఓ బ్యూలా, ఎంపీడీఓ పీవీవీ ప్రకాష్, తహసీల్దార్ జేవీ సుబ్బారావు, అంగన్‌వాడీ సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



గుణ్ణంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో కలెక్టర్ వెట్రిసెల్వి

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో శనివారం నిర్వహించిన తిరంగా యాత్రలో అన్ని వర్గాల ప్రజలు జాతీయజెండాను చేతబట్టి ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ రక్షణ కోసం సైనికులు చేస్తున్న త్యాగాలను కొనియాడుతూ వారికి సెల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో మన సైనిక శక్తి సత్తా ఏంటో ప్రపంచానికి తెలిసిందన్నారు. పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డు, ఏలూరు రోడ్డు, బుట్టాయగూడెం రోడ్లలో మోటార్‌సైకిల్ లైట్ల వెలుగులో భారత్‌మాతాకీ జై అంటూ నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బోసుబొమ్మసెంటర్‌లో మానవహారం నిర్మించారు. దేశ రక్షణలో భాగస్వాములైన మాజీ సైనికులను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలి

జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా

చింతలపూడి: ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా ఆదేశించారు. చింతలపూడి మండలంలోని రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలతో ఏడీ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌలు రైతులకు క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డ్స్ జారీ, అన్నదాత సుఖీభవ రైతుల ధ్రువీకరణ, పురోగతిపై, మట్టి నమూనాల సేకరణపై సమీక్ష చేశారు. అనంతరం రైతు సేవా కేంద్రాలకు అవసరమైన స్టేషనరీ సామాగ్రిని రైతు సేవ కేంద్రం ఇన్‌చార్జిలకు అందజేశారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ సాగు పట్ల శ్రద్ధ చూపాలని రైతులకు సూచించారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడడం, పంట వ్యర్థాలను కాల్చడం వలన నేలకు అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి, నేల సారవంతం కోల్పోయి కాలుష్యానికి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూసార పరీక్షలతో నేలలో లభ్యమయ్యే పోషకాలతో పాటు చౌడు గుణాలు, ఎక్కువ సున్నం కలిగిన గుణాలను కూడా తెలుసుకుని తద్వారా ఎరువుల యాజమాన్య పద్ధతులు చేపట్టడం వలన పంటలపై పెట్టే పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో భూసార పరీక్షలు కోసం మట్టి నమూనా సేకరణ విధానాన్ని పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం ఆవరణలో పక్షుల దాహార్తిని తీర్చడానికి నీటి పెళ్లాలను ఏర్పాటు చేశారు. అంతకుముందు చింతలపూడి పట్టణంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏడీ బి నాగ కుమార్, వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు స్టేషనరీని అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా

పరిశుభ్రత జీవితంలో ప్రధాన భాగం కావాలి

ద్వారకాతిరుమల: పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో ప్రధాన భాగం కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. గుణ్ణంపల్లిలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా బీట్ ది హీట్ కార్యక్రమంలో భాగంలో ఆమె గ్రామంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరాన్ని, పశువైద్య శిబిరాన్ని సందర్శించి, పశు పోషకులకు మందులను అందజేశారు. ఆ తరువాత స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆమె చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రాలు, గ్రీన్ అంబాసిడర్ లను సత్కరించారు. అనంతరం అందరితో స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలన్నారు. అప్పుడే అనారోగ్యాలు దరిచేరవన్నారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తలను వేరుచేసి, ఇంటింటికి వచ్చి చెత్త సేకరించే వారికి అందించాలన్నారు. ఇంటి పరిసరాల్లో రెండు మొక్కలు చొప్పున నాటి, ఉష్ణోగ్రతలను తగ్గించే విధానాలను అవలంభించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్య ఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎంవీ రమణ, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, ఎంపీడీవో పీవీవీ ప్రకాష్, తహసీల్దార్ జేవీ సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల: గుణ్ణంపల్లిలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఎక్సైజ్ స్టేషన్‌లో...

జంగారెడ్డిగూడెం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు మాట్లాడుతూ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటడం, స్టేషన్ పరిసరాలు శుభ్రపరిచినట్లు చెప్పారు. అశ్వారావుపేట రోడ్డులో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

వడదెబ్బ నుంచి రక్షణ పొందండి

జంగారెడ్డిగూడెం: వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా వైద్యాధికారులు సూచించిన విధంగా ప్రతి ఒక్కరూ రక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి సూచించారు. పట్టణంలో మున్సిపాలిటీలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. దీనిలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ రోడ్డు వరకు అవగాహన ర్యాలీ, అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛత, పచ్చదనం పెంపొందించడం, గ్రీన్ ఎనర్జీపై అధికారులు అవగాహన కల్పించే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ కేవీ రమణ, తహసీల్దార్ స్లీవజోజి, కౌన్సిలర్‌లు, చిట్టిబోయిన రామలిగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రకు సహకరించండి

లింగపాలెం: గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వర్ణాంధ్రకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నూజివీడు డీఎల్‌పీవో సుందరి కోరారు. శనివారం లింగపాలెంలో పలు కార్యక్రమాలను నిర్వహించి పారిశుద్ధ్యంకు సంబంధించి తనిఖీలు చేశారు. లింగపాలెం సర్పంచ్ తగరం హేమలత, ఎంపీడీవో కె.వాణి, డిప్యూటీ ఎండీఓ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బుట్టాయగూడెం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా కృషి చేయాలని ఐటీడీఏ పీఓ కె. రాములు నాయక్ అన్నారు. కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ సిబ్బందితోపాటు పరిసరాలను శుభ్రం చేశారు. అదేవిధంగా వర్షపు నీరు వృథాగా పోకుండా ఉండే విధంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. అనంతరం ఐటీడీఏ ప్రాంగణం వద్ద మొక్కలు నాటారు.



జంగారెడ్డిగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం: ఐటీడీఏలో ఇంకుడు గుంతలు తవ్వుతున్న పీఓ



లింగపాలెం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

డ్వాక్రా మహిళలతో సమావేశం

బుట్టాయగూడెం: మండలంలోని గాడిదబోరులో డ్వాక్రా సంఘాల మహిళలతో ఏపీఎం పద్మావతి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్రూప్‌లకు సంబంధించి డ్వాక్రా మహిళలకు తెలియకుండా రుణాలు జమైన విషయంపై ఆరా తీశారు. సోమవారం బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడి ఈ సమస్యను ఒక కొలిక్కి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. బ్యాంక్ ఖాతాలో జమ అయిన సొమ్ములను తిరిగి బ్యాంక్‌కే చెల్లిస్తామని మహిళలు చెప్పారు. అయితే వడ్డీకి సంబంధించి సుమారు రూ. 77,672 సొమ్ముపై బ్యాంక్ పైఅధికారులకు కూడా తెలియజేసే విధంగా మేనేజర్‌తో మాట్లాడతానని ఏపీఎం చెప్పారు.